సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం। 15। అక్టోబర్। 2025



సివిల్స్ ఉచిత శిక్షణకు ఎంపిక

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ విద్యార్థులు సివిల్స్ ఉచిత శిక్షణకు ఎంపికైనట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు.

-IIలో



16న ఎన్ఎస్ఎస్ ఉత్తమ పురస్కారాల ప్రదానం

విస్మృత సేవలందించిన కళాశాలలు, ప్రోగ్రాం ఆఫీసర్లు, వలంటీర్లకు పురస్కారాల ప్రదానం చేయనున్నారు.

-IIలో

గరిష్టం/కనిష్టం
33.2/24.6

వాతావరణం

జిల్లాలో మంగళవారం 24.6 - 33.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నాలుగు మండలాల్లో వర్షం



కడప అగ్రికల్చర్: ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో నాలుగు మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో భాగంగా జమ్మలమడుగులో 16.4 మి.మీ, మైలవరంలో 15.6 మి.మీ, పోరుమామిళ్లలో 1.2 మి.మీ, రాజుపాలెంలో 1 మి.మీ వర్షం కురిసింది.

ప్రధాని సభకు వేలాది ఆర్టీసీ బస్సులు



కడప కోటిరెడ్డి సర్కిల్: ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో ఆయన నిర్వహించే సభకు రాయలసీమ జిల్లాల నుంచి 3300 ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. తిరుపతి నుంచి 320, చిత్తూరు 280, అన్నమయ్య 225, వైఎస్సార్ 340, నంద్యాల 310, కర్నూలు 225, అనంతపురం 225, శ్రీ సత్యసాయి జిల్లా నుంచి 260 బస్సులు వెళ్లేలా ప్రణాళికలు రూపొందించారు.

ప్రధాని సభకు ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో ఈనెల 16న ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సభకు పరిశ్రమల యజమానులు హాజరుకావాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం చాంద్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు జరిగే సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ సభకు జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల యజమానులు, పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల సంఘ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

16న ప్రత్యేక విద్యుత్ అదాలత్

కడప కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ్యా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించే ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి, సభ్యులు జి. మధుకుమార్, ఏ. శ్రీనివాస బాబు, విజయలక్ష్మి పాల్గొని వినియోగదారుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తారన్నారు. వినియోగదారులకు ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే ఈ ప్రత్యేక అదాలత్‌కు హాజరై పరిష్కరించుకోవాలని సూచించారు.

పథకాలను ప్రజలకు చేరవేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధశాఖ అధికారులు శ్రీనివాసులు

కడప అగ్రికల్చర్: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరవేయాలని జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు సూచించారు. కడపలోని జిల్లా పశుసంవర్ధశాఖ కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని డిప్యూటి డైరెక్టర్లు, అడిషినల్ డైరెక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అలాగే జిల్లాలో పాడిపరిశ్రమ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. డీడీలతోపాటు ఏడీలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



రాజంపేట టౌన్: రాజంపేట పట్టణంలోని ఉర్దూ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులను గెస్ట్‌ఫ్యాకల్టీ పద్ధతిలో బోధించడానికి ఈనెల 17లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సునీల్‌బర్నబాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పీజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అలాగే డిగ్రీ ఉర్దూ మీడియంలో చదివిన వారు లేక డిగ్రీలో ఉర్దూ లాంగ్వేజి చదివి ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు కళాశాల కార్యాలయ పనిదినాల్లో దరఖాస్తులను అందజేయాలన్నారు. ఈనెల 21వ తేదీ ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట విద్యార్హతకు సంబంధించి ఒరిజినల్, జిరాక్స్ కాపీలను తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందిన వారైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నెలకు 27 వేల రూపాయల వేతనం ఉంటుందని వివరించారు.



ఈయన పేరు శిరిగిరెడ్డి రవీంద్రారెడ్డి వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లె గ్రామం. రెండు ఎకరాలు ఉల్లి పంట సాగుచేశారు. అందుకు రూ.2లక్షలు పెట్టుబడి పెట్టారు. పంట దిగుబడి బాగా వచ్చింది. ఎర్రగడ్డలు కొనుగోలు చేసేందుకు వ్యాపారస్తులు ముందుకు రాలేదు. ప్రభుత్వం క్వింటాల్ రూ.1200తో కొనుగోలు చేస్తామని ప్రకటించింది. అలా కొనుగోలు కేంద్రాల ద్వారా కూడా సేకరించలేదు. విధిలేని పరిస్థితుల్లో సహచర రైతులతో కలిసి 4.5టన్నులు ఎర్రగడ్డలు చెన్నై మార్కెట్‌కు తీసుకెళ్లారు. అక్కడ మేలు రకం గడ్డలు కిలో రూ.5, తాలు గడ్డలు కిలో రూ.3.50 ధర పలికింది. రూ.26వేలు లభించగా, ట్రాన్సుపోర్టు ఇతర ఖర్చులు రూ.15వేలు వచ్చాయి. ఆ రైతుకు మిలిగింది రూ.11వేలు మాత్రమే. ప్రభుత్వం ప్రకటించినట్లుగా క్వింటా రూ.12వందలతో కొనుగోలు చేసింటే రవీంద్రారెడ్డి ఎర్రగడ్డలకు స్థానికంగా రూ.54 వేలు లభించేది. కనీసం పెట్టుబడి ఖర్చులైనా సమకూరేవని రవీంద్రారెడ్డి వాపోతున్నారు.





ఈ రైతు పేరు ఎద్దుల మహేశ్వర్‌రెడ్డి. 8ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశారు. పంట నూర్పిడి ఖర్చులు కాకుండా రూ.6లక్షల పెట్టుబడి పెట్టారు. ఆశించిన దిగుబడి ఉన్నా, కొనుగోలు చేసేవారు లేరు. నూర్పిడి ఖర్చులు భరించి దిగుబడిలో కొంతభాగం 11టన్నులు సహచర రైతులతో కలిసి చెన్నై మార్కెట్‌కు తీసుకెళ్లారు. మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో 11 టన్నులకు రూ.43,900 సమకూరింది. అందులో రవాణా ఇతర ఖర్చులు రూ.26,200లు వచ్చాయి. మహేశ్వరరెడ్డికి రూ.17,700లు మాత్రమే చేతికి వచ్చాయి. సంచులు, హమాలీల ఖర్చులు పోతే మహేశ్వరరెడ్డి చేతిలో మిగిలింది శూన్యం. దాంతో మిగిలిన పంట స్థానికంగా గొర్రెలకు మేతగా మారింది. మహేశ్వరరెడ్డి కంట కన్నీరు మిగిలింది.

ఉల్లి రైతుల ఆశలు రాలిపాయె

రైతు కంట కన్నీరు!

- మాటలకే పరిమితమైన కూటమి ప్రభుత్వం
- రూ.12వందలతో కొనుగోలు ఉత్తిమాటే
- తాడేపల్లిగూడెం, చెన్నై మార్కెట్‌కు తరలించినా ఖర్చులూ దక్కని వైనం
- ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై మండిపడుతున్న రైతన్నలు



మైదుకూరు ప్రాంతంలో పొలంలోనే వదిలేసిన ఉల్లి పంట

సాక్షి ప్రతినిధి, కడప: ఒకరా ఇద్దరా జిల్లా వ్యాప్తంగా 19వేల ఎకరాల్లో సాగుచేసిన రైతులందరి దుస్థితి ఇదే. ఉల్లి రైతులను ప్రభుత్వం గాలికొదిలేసింది. క్వింటాల్ రూ.12వందలతో కొనుగోలు చేస్తామని ప్రకటించి ఉల్లి రైతులకు పంగనామాలు పెట్టింది. రైతులు గగ్గోలు పెడుతున్నా, ఆత్మహత్యలే శరణ్యమంటున్నా కూటమి ప్రభుత్వం మాత్రం కేవలం మాటలకే పరిమితమవుతోంది. హెక్టారుకు రూ.50 వేలు ఇస్తామన్న మాట కూడా నీటి మూటగానే మిగిలిపోయింది.

ఉల్లి రైతు గోడు పట్టని ప్రభుత్వం...

రాయలసీమ జిల్లాల ఉల్లి రైతుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆరుగాలం శ్రమించి మంచి దిగుబడిని సాధించినా, అమ్ముకునే సమయానికి రైతులు కుదేలవుతున్నారు. కడప, కర్నూలు జిల్లాల్లో అధికంగా ఉల్లి పండించే ప్రాంతాల్లో ధర భారీ స్థాయిలో పడిపోయింది. ఎకరాలకు లక్షన్నర వరకూ పెట్టుబడి పెడితే క్వింటాల్ ఉల్లి కనీసం రూ.500 కూడా పలకడం లేదు. దీంతో రైతులు ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో పంటను మధ్యలోనే వదిలేస్తున్నారు. కొందరు కాల్వల్లో పడేయగా, మరికొందరు రోడ్లపై పారబోస్తున్నారు. అయినా ప్రభుత్వం స్పందించడం లేదు. రైతులు ఆందోళన వ్యక్తం చేసిన సందర్భంలో ప్రభుత్వం కంటితుడుపు చర్యగా మాటలు చెప్పడం తప్ప చేసిందేమీ లేకుండా పోతోందని పలువురు వాపోతున్నారు. స్వయంగా రైతులు తాడేపల్లిగూడెం, చెన్నై మార్కెట్‌లకు తరలిస్తే లారీ బాడుగులు, ఖర్చులకు అక్కడే సరుకు వదిలేసి ఉత్తి చేతులతో ఇంటికి చేరాల్సిన దుస్థితి ఏర్పడింది.

కనికరం చూపని ప్రజాప్రతినిధులు

జిల్లా వ్యాప్తంగా 19వేల ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశారు. పెట్టుబడి రూపంలో సుమారు రూ.2కోట్లు ఖర్చు పెట్టారు. ఆదాయం దేవుడెరుగు కనీసం పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి ఉల్లి రైతు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మైదుకూరు, కమలాపురం నియోజకవర్గాలల్లో అధికంగా సాగులో ఉండగా, పులివెందుల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గాలల్లో పాక్షికంగా సాగులో ఉంది. అధికార పక్షం ప్రజాప్రతినిధులుగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయా ప్రాంతాల నేతలెవ్వరూ ఉల్లి రైతుల పట్ల కనీస కనికరం చూపెట్టలేదు. మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు, సీఎంఓ దృష్టికి తీసుకెళ్లి ఉల్లి దిగుబడులను కొనుగోలు కేంద్రాలు ద్వారా సేకరించింటే కనీసం పెట్టుబడి లభించేది. ఎమ్మెల్యేలు బాధ్యతలను విస్మరించి వ్యక్తిగత ఆదాయ మార్గాల్లో నిమగ్నమయ్యారని రైతులు వాపోతున్నారు.

మాటలకే పరిమితం...



ఉల్లి రైతుల కష్టాలను రైతులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఆందోళన చేస్తున్నా, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినా కనికరం చూపిన దాఖలాలు లేవు. వాస్తవంగా కర్నూలులో ఉల్లి రైతుల సమస్య ఉత్పన్నమైనప్పుడు ప్రభుత్వం రూ.1200 కనీస మద్దతు ధర ఇస్తామని, ఆ తర్వాత హెక్టారుకు రూ.50వేలు ఇస్తామని మాటలు చెప్పింది. కడప కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సైతం క్వింటాల్ రూ.12వందలతో కొనుగోలు కేంద్రాలు ద్వారా సేకరించుకున్నట్లు ప్రకటించారు. మాటలకు పరిమితం మినహా ఆచరణలో చూపెట్టకపోయారు. కర్నూలులో ఇచ్చిన హామీ మేరకు రైతుల ఎన్‌రోల్‌మెంట్ కూడా చేపట్టలేదు. రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వంలో కనీస స్పందన లేకపోవడంతో ఉల్లి రైతుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. రెండు నెలలుగా రైతులు కష్టాలను ఎదుర్కొంటున్నా ఇప్పటికీ కూటమి నేతలు ఉల్లి రైతుల సమస్యకు పరిష్కారం చూపలేదు. ప్రభుత్వమే ఉల్లిని కొనుగోలు చేయడం, లేదా మద్దతు ధర అందించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించడం కానీ చేయడం లేదు.

ఒంటిమిట్ట హుండీ ఆదాయం లెక్కింపు



నగదు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం ఆలయ టీటీడీ అధికారులు లెక్కించారు. సెప్టెంబర్ 10 నుంచి అక్టోబర్ 14 వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కింపు చేశారు. ఆలయ రంగమండపంలో ఈ కార్యక్రమం జరిగింది. హుండీల ద్వారా ఆదాయం రూ.7,45,356 వచ్చినట్లు అధికారుల వెల్లడించారు.

సీపీఆర్‌పై అవగాహన ముఖ్యం: డీఎంహెచ్‌ఓ



సీపీఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్: ప్రజలు సీపీఆర్ విధానంను నేర్చుకొని ఎదుట వ్యక్తి ప్రాణాలను కాపాడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రాణరక్షణ మన కర్తవ్యం అనే నినాదంతో కార్యాలయ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జీవనశైలి విధానంలో ఎన్నో మార్పులు సంభవించాయన్నారు. అందులో భాగంగా ప్రమాదవశాత్తు జరిగే సంఘటనల కారణంగా ఊపిరి ఆగిపోవడం, తీవ్ర అనారోగ్యానికి గురి కావడం తదితర ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ ద్వారా ప్రాణాలను కాపాడవచ్చన్నారు.

కాలుష్య నియంత్రణకు పటిష్ట చర్యలు

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: కడప నగరంలో వాయు కాలుష్య నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో నేషనల్ క్లియర్ ఎయిర్ ప్రోగ్రాం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వాయు కాలుష్య నియంత్రణ అమలుపై ఏర్పాటైన జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు దేశంలోని వాయుకాలుష్యం కలిగిన 132 నగరాలలో కాలుష్య నియంత్రణకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. వాటిలో కడప నగరం ఒకటని, ఈ ప్రాంతంలో వాయు కాలుష్యం వ్యాపించడంపై మూలకారణాలు తెలుసుకుని, వాటిని నియంత్రించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికబద్ధంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలుష్య నియంత్రణకు నగరంలో పెద్దఎత్తున మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించాలని, వాహనాల ద్వారా కాలుష్యం వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో వాయు కాలుష్యం వ్యాప్తి చెందే ముఖ్యమైన ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో వాయు కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంలో భాగంగా (ఎన్ఏపీ)కడపకు నగరానికి నిధులు కేటాయించామన్నారు. ఈ నిధులతో కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో చేపట్టిన వివిధ పనుల పురోగతిపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. పెండింగ్‌లోని సీసీ రోడ్లు, ప్లాంటేషన్ తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం కడప కాలుష్య నియంత్రణ బోర్డ్ ఆధ్వర్యంలో రూపొందించిన దివాలి ఎకో ఫ్రెండ్లీ గిఫ్ట్స్ పోస్టర్స్‌ను కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కడప నగర కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డి, పర్యావరణ ఇంజనీరింగ్ అధికారి సుధా కురుభ, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల తరఫున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతర పోరాటాలు కొనసాగిస్తుందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల వేళ చంద్రబాబు నాయుడు చెప్పిన సూపర్ సిక్స్ హామీలు.. సూపర్ ఫ్లాప్‌గా మారాయని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ఏ ఒక్క పంటకు గిట్టుబాటు ధరలేక రైతన్నలు అవస్థలు పడుతున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రైతన్నలను ఆదుకున్నామని గుర్తు చేశారు. అనంతరం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు.

సబ్సిడీ శనగలు ఇవ్వడం లేదు..

ప్రభుత్వం ఇప్పటివరకు సబ్సిడీపై శనగలు అందించడంలేదని, విత్తనం వేసే టైంలో చాలా ఇబ్బందులు పడుతున్నామని మంగళవారం పులివెందుల, వేముల మండలాలకు చెందిన పలువురు రైతులు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో వాపోయారు. అధికారులను అడిగితే పట్టించుకోవడంలేదని, గత్యంతరంలేక ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక ధరలకు శనగలు కొనుగోలు చేస్తున్నామని మొర పెట్టుకున్నారు. స్పందించిన ఎంపీ వ్యవసాయ శాఖ జేడీతో మాట్లాడారు. వెంటనే శనగలు సరఫరా చేయాలని సూచించారు. దీనికి జేడీ రెండు రోజుల్లో శనగల రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తామని ఎంపీకి వివరించారు.

ఉపాధి పథకం అనుసంధానానికి వినతి

రైతుల వ్యవసాయ పనులను ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేయాలని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని ఆర్‌సీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి రైతుల తరఫున వినతిపత్రం ఇచ్చారు. ఆర్‌సీడీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రఘురామిరెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎద్దుల అర్జున్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ వేముల మండల అధ్యక్షులు నాగేళ్ల సాంబశివారెడ్డిలతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలకు గిట్టుబాటు ధరలు లేక, రైతులు కూలీలకు వేతనాలు చెల్లించడంలో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకాన్ని రైతుల వ్యవసాయ పనులకు నేరుగా అనుసంధానం చేయడంవల్ల రైతులకు కూలీల పెట్టుబడి భారం గణనీయంగా తగ్గి రైతులకు ఆర్థికంగా కొంత ఊరట లభిస్తుందని పేర్కొన్నారు.

ఒప్పందంలో ఏ తప్పు దాగుందో!

- కడప రిమ్స్ లో ఆక్సిజన్ సరఫరా' కాంట్రాక్ట్ వ్యవహారంలో 'గోల్ మాల్'!
- అధికార దర్పంతో అగ్రిమెంట్ రద్దుచేసి.. ఆపై మరో సంస్థకు కట్టబెట్టిన వైనం
- అగ్రిమెంట్ దక్కించుకున్న ఏజెన్సీపై పలు ఆరోపణలు, కేసులు నమోదు





కడప రిమ్స్ ఓపి విభాగం

సాక్షి,టాస్క్ ఫోర్స్: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో రోగుల వైద్యం కోసం ఉపయోగించే ఆక్సిజన్ సిలిండర్ల సరఫరా కాంట్రాక్ట్ వ్యవహారంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తోచిన రీతిలో అగ్రిమెంట్లు చేసుకుంటూ నిబంధనలకు నీళ్లొదులుతున్నారు.

వివరాల్లోకి వెళితే..

జిల్లాలోని ఎర్రగుంట్లకు చెందిన వారాశి సంస్థకు 2015 నుంచి 2020 వరకు రిమ్స్‌కు ఆక్సిజన్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం కాంట్రాక్ట్ ఇచ్చింది. అనంతరం మూడేళ్లు, ఆపై ఒక్కో ఏడాది పొడిగిస్తూ 2025 వరకు ఒప్పందం కొనసాగించారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది జూలై 22న వారాశి సంస్థకే మరో ఏడాది రెన్యూవల్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం 2026 వరకు సదరు సంస్థకు ఒప్పందం ఉంది. తెరవెనుక ఏ మతలబు జరిగిందో.. ఏ రాజకీయ ఒత్తిడి ఎక్కువైందో గానీ రెన్యూవల్ ఉత్తర్వులు జారీ చేసిన 4 రోజులకే అంటే జూలై 26నే వారాశి సంస్థతో కుదుర్చుకున్న అగ్రిమెంట్‌ను రద్దు చేశారు. అదే నెల 30న కర్నూలుకు చెందిన శ్రీ భారత్ ఫార్మా సంస్థతో ఆక్సిజన్ సరఫరా కోసం కొత్త అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. నిజానికి శ్రీ భారత్ ఫార్మా కంపెనీకి 2018లోనే పదేళ్లపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రభుత్వ ఆసుపత్రులకు ఆక్సిజన్ సరఫరా చేసేందుకు టెండర్లు పిలవకుండానే అగ్రిమెంట్ చేశారు. అందులో భాగంగానే 2021లోనే రిమ్స్‌కూ ఆక్సిజన్ సరఫరా చేయాలని శ్రీ భారత్ సంస్థను అధికారులు కోరారు. అప్పట్లో సిలిండర్ల సరఫరా చేయలేయమని శ్రీ భారత్ సంస్థ చేతులెత్తేసింది. దీంతో వారాశికే ప్రభుత్వం ఆక్సిజన్ సిలిండర్ల కాంట్రాక్ట్‌ను పొడిగించింది.



మళ్లీ శ్రీ భారత్ ఫార్మాకే...

తాజాగా రిమ్స్‌కు ఆక్సిజన్ సరఫరా చేసే కాంట్రాక్ట్‌ను శ్రీ భారత్ ఫార్మా వారికి కట్టబెట్టారు. కాగా ఆక్సిజన్ సిలిండర్ల సరఫరా సక్రమంగా చేయకపోవడం వల్ల 23 మంది ప్రాణాలు కోల్పోయారని తిరుపతిలో రుయా హాస్పిటల్ అధికారులు శ్రీ భారత్ ఫార్మాపై ఫిర్యాదు చేశారు. 2021 జూలై 23న ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అలాంటి సంస్థకే కడప రిమ్స్ అధికారులు ఆక్సిజన్ సరఫరా కాంట్రాక్ట్‌ను కట్టబెట్టడాన్ని పరిశీలకులు తప్పుబడుతున్నారు. కాంట్రాక్ట్ మధ్యలో 2020 నుంచి 2025 వరకు ఐదేళ్లపాటు సరఫరా చేయలేని సంస్థకు కాంట్రాక్టు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. పైగా దక్షిణ భారతదేశంలోనే ఎక్కువ రేటుతో ఆక్సిజన్‌ను సరఫరా చేసే ఏకైక సంస్థ శ్రీ భారత్ ఫార్మా కంపెనీ కావడం గమనార్హం. మరోవైపు శ్రీ భారత్ ఫార్మా కంపెనీ ఏజెన్సీ విధానాలపై, కర్నూలు అనంతపురం జీజీహెచ్‌లలో జరుగుతున్న అవకతవకలపై ఇప్పటికే విజిలెన్స్ కమిటీతో విచారణ చేయాలని మంత్రి టీజీ భరత్ డిమాండ్ చేయడం గమనార్హం. అవినీతి ఆరోపణలు, కేసులు నమోదైన సంస్థకు, ఎక్కువ ధరకు మరోసారి రెన్యువల్ చేయడం వెనక మతలబు దాగి ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. 'ఒప్పందం'లో ఏ తప్పు దాగుందో సదరు అధికారులకే ఎరుక.

చెరువు మట్టిపై కూటమి నేతల కన్ను


మట్టిని తోలుతున్న టిప్పర్

చెరువులపై కూటమి నేత కన్ను పడింది. పంట పొలాల్లో వేసుకునేందుకు అనుమతులు తీసుకుని 100 టిప్పర్ల మట్టి తవ్వి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని కోనమ్మ చెరువులో మట్టి తరలించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు కొన్ని క్యూబిక్ మీటర్ల వరకు అనుమతులు ఇచ్చారు. ఇదే అదునుగా కూటమి నాయకులు పెద్ద ఎత్తున తవ్వి తరలిస్తున్నారు. టిప్పర్‌కు రూ.500 వసూలు చేస్తూ నిత్యం వంద టిప్పర్లకు పైగా మట్టి తరలిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే.. కూటమి నాయకులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అడ్డు చెప్పిన అధికారులకు పైస్థాయి లీడర్లతో ఫోన్లు చేయించి బెదిరించడం పరిపాటిగా మారింది. ఇలాగే వదిలేస్తే.. పెద్ద ఎత్తున గోతులు పడి రాబోయే వర్షాలకు నీరు చేరి ప్రమాదంగా మారే పరిస్థితి ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – పుల్లంపేట

క్లుప్తంగా

అంగన్వాడీ టీచర్‌కు గాయాలు

ముద్దనూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామంలో మంగళవారం ఉదయం అంగన్వాడీ టీచర్ ప్రమీలను కారు ఢీకొంది. ఈ ఘటనలో ఆమె తీవ్ర గాయాలపాలైంది. స్థానికుల సమాచారం మేరకు ప్రమీల కొత్తపల్లెలోని ప్రధాన రహదారిని దాటుతుండగా వేగంగా ప్రయాణిస్తున్న కారు ఢీకొంది. గాయాలపాలైన ఆమెను 108 వాహనంలో ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు.

మద్యం తాగి ఒకరు మృతి


నరసింహులు మృతదేహం వద్ద భార్య, పిల్లలు

జమ్మలమడుగు : పట్టణంలోని ఎత్తపువారి కాలనీలో నరసింహులు(35) అనే వ్యక్తి మద్యం తాగి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత కొంత కాలంలో మద్యానికి బానిసై అతిగా తాగుతుండటంతో శరీరంలోని భాగాలు దెబ్బతిన్నాయని, దీంతో నరసింహులు చనిపోయారని తెలిపారు. బేల్దారి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న యజమాని మృతి చెందడంతో భార్య, అతడి పిల్లలు విషాదంలో మునిగిపోయారు.

ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

కడపఅర్బన్ : కడప నగరం శంకరాపురంలో కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు చిన్న చౌక్ సీఐ ఓబులేసు తెలిపారు. సీఐ వివరాల మేరకు.. శంకరాపురానికి చెందిన విజయకుమార్ సమీపంలో నివాసమున్న అక్కిశెట్టి వెంకట్ మంగళవారం చిన్న విషయమై గొడవపడ్డారు. దీంతో ఆవేశంతో విజయ్ కుమార్‌ను కులం పేరుతో దూషిస్తూ వెంకట్ దాడి చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారిస్తున్నామని సీఐ తెలిపారు.

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరం చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు సుబ్బరాయుడు అనే వృద్ధుడు ఇంటి సమీపంలో ఆడుకుంటున్న 8 సంవత్సరాల బాలికను ఇంట్లోకి పిలిపించుకొని అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ఎల్ఎల్‌బీ పరీక్ష కేంద్రాల తనిఖీ


ఎల్ఎల్‌బి పరీక్షలను తనిఖీ చేస్తున్న వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయంలోలా సెమిస్టర్ పరీక్ష కేంద్రాలను నూతన ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ మంగళవారం తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించి పరీక్షల ఏర్పాట్ల గురించి చీఫ్ సూపరింటెండెంట్ ఆచార్య జి.కాత్యాయనిని ఆరా తీశారు. ప్రస్తుత పరీక్షకు 503 మంది హాజరయ్యారని తెలిపారు. అతి పెద్ద పరీక్షల హాల్‌ను వీసీ పరిశీలించారు. ఆయన వెంట కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కెఎస్వీ.కృష్ణారావు ఉన్నారు. పరీక్షల విధుల్లో పరీక్షల అబ్జర్వర్ డా.గణేష్నాయక్, సహాయ పరీక్షల అధికారులు డా .టి. లక్ష్మి ప్రసాద్, డా.మునికుమారి, సిబ్బంది పి.చంద్రమౌళి పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉద్యోగి ఇంటి ఎదుట హిజ్రా నిరసన

లక్షల్లో నగదు, బంగారం తీసుకుని మోసం చేశాడని ఆరోపణ


ప్రైవేట్ ఉద్యోగి ఇంటి ఎదుట నిరసన తెలుపుతూ న్యాయంచేయాలని కోరుతున్న స్వాతి.

మదనపల్లె రూరల్ : ఆర్థిక లావాదేవీల్లో భాగంగా లక్షల రూపాయల నగదుతో పాటు బంగారు నగలు, విలువైన ఆస్తి పత్రాలు తీసుకుని ఓ ప్రైవేట్ ఉద్యోగి, అతడి భార్య తనను నిలువునా మోసం చేశారని, అడిగితే ఇవ్వకపోగా..తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని హిజ్రా స్వాతి ఆవేదన వ్యక్తం చేసింది. పట్టణంలోని ముజీబ్ నగర్‌లోని ప్రైవేట్ ఉద్యోగి ఇంటి ఎదుట మంగళవారం సాయంత్రం హిజ్రా బైఠాయించి నిరసనకు దిగింది. బాధితురాలి వివరాల మేరకు...పట్టణంలోని చీకలిగుట్ట గౌతమీ నగర్‌లో భర్త దుర్గాప్రసాద్‌తో కలిసి చీటీలు వేసుకుని హిజ్రా స్వాతి జీవనం సాగిస్తోంది. ఐదేళ్ల క్రితం తన స్నేహితురాలు చంద్రకళ..ముజీబ్ నగర్‌కు చెందిన ప్రైవేట్ కాలేజీ క్యాషియర్, వడ్డీ వ్యాపారి ధమరేశ్వర్, అతడి భార్య స్వర్ణలత వద్ద రూ.30 లక్షలు అప్పు తీసుకోగా హిజ్రా స్వాతి పూచీ పడింది. అనంతరం చంద్రకళ వడ్డీ, అసలు కట్టలేక ఐపీ పెట్టి వెళ్లిపోయింది. స్నేహితురాలు చంద్రకళకు పూచీ పడిన స్వాతిని అప్పు చెల్లించాల్సిందిగా ధమరేశ్వర్ దంపతులు ఒత్తిడిచేశారు. ఈ క్రమంలో తన కష్టార్జితంతో పాటు, ఇతరుల నుంచి పెద్ద మొత్తంలో అప్పుచేసి, విడతల వారీగా ఫోన్ పే ద్వారా రూ.34లక్షలు, అకౌంట్ ద్వారా రూ.8లక్షలు, నగదు రూపేణా రూ.23లక్షల90వేలు, 600 గ్రాముల బంగారు ఇచ్చినట్లు స్వాతి తెలిపారు. వ్వడం జరిగిందన్నారు. స్నేహితురాలు చేసిన అప్పును వడ్డీతో సహా చెల్లించినప్పటికీ, తాను వారికి ఇచ్చిన నగదు, బంగారు, ఆస్తి పత్రాలను తిరిగి ఇవ్వాలని అడిగితే.. ఇవ్వకపోగా, వేధింపులకు గురిచేశారన్నారు. టూటౌన్ పోలీసులను ఆశ్రయిస్తే...పోలీసుల ఎదుట ఇచ్చేస్తామని అంగీకరించి అనంతరం మొండికేశారన్నారు. అంగబలం, ఆర్థిక బలాన్ని ఉపయోగించి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాకుండా చేశారని, నగదు, డబ్బులు అడిగితే...రెండు రోజుల క్రితం ఎస్టేట్ సమీపంలో తనపై ధమరేశ్వర్, అతడి భార్య స్వర్ణలత దాడికి పాల్పడ్డారన్నారు. దాడి విషయం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసి, సీసీ ఫుటేజీ ఆధారాలను అందించినా పోలీసులు చర్యలు తీసుకోలేదన్నారు. విధిలేని పరిస్థితుల్లో తనకు అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిడి అధికమవడంతో ధమరేశ్వర్ ఇంటి ఎదుట బైఠాయించినట్లు తెలిపింది. పోలీసులు తనకు న్యాయం చేయాలని కోరింది.

వరకట్నం వేధింపులతో
వివాహిత ఆత్మహత్యాయత్నం

ఆస్పత్రిలో కుటుంబసభ్యుల ఘర్షణ


ఆత్మహత్యకు పాల్పడిన హీనా కౌసర్

మదనపల్లె రూరల్ : వరకట్నం వేధింపులకు ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, జిల్లా ఆస్పత్రి ఆవరణలో ఇరు కుటుంబాల సభ్యులు ఘర్షణకు దిగిన ఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. బాధితుల వివరాల మేరకు.. పట్టణంలోని మోతీనగర్‌కు చెందిన వసీంకు రామసముద్రానికి చెందిన హీనా కౌసర్(23)ను ఇచ్చి రెండేళ్ల క్రితం వివాహం జరిపించారు. వీరికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. పెళ్లి అయిన నెల రోజుల నుంచే అత్తింటివారు అదనపు కట్నం కోసం తరచూ వేధించడం, కొట్టడం, తిట్టడం చేసే వారు. ఈ క్రమంలో మంగళవారం అదనపు కట్నం విషయమై మరోసారి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. తీవ్ర మనస్తాపానికి గురైన హీనాకౌసర్ ఇంట్లో ఉన్న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేసింది. విషయం తెలుసుకున్న ఆమె సోదరుడు మహమ్మద్ ఇర్ఫాన్, మదనపల్లెకు చేరుకుని హీనా కౌసర్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. భర్త వసీం అడ్డుకోవడంతో ఘర్షణ తలెత్తింది. మహమ్మద్ ఇర్ఫాన్‌పై వసీం కుటుంబసభ్యులు దాడికి దిగారు. అనంతరం హీనా కౌసర్‌ను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. ఆమెను 108 అంబులెన్స్ వాహనంలో ఎక్కిస్తుండగా, హీనా కౌసర్ కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. అక్కడే ఉన్న వసీం కుటుంబ సభ్యులతో గొడవపడి కొట్టుకున్నారు. దీంతో టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని బాధితురాలిని తిరుపతికి పంపించి, కుటుంబ సభ్యులను పంపేశారు.

క్యారమ్స్ విజేత తమిళనాడు

నందలూరు : యంగ్ మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దక్షిణ భారత స్థాయిలో జరిగిన పోటీల్లో డబుల్స్ కేటగిరీలో విజేతగా చెన్నై, రన్నర్స్‌గా కోయంబత్తూరు జట్లు నిలిచాయి. ఈ జట్టు సభ్యులకు రూ.40వేలు, రూ.25వేల నగదు అందజేశారు. సింగిల్స్ కేటగిరీలో మొదటి బహుమతి రూ.25 వేలు, కేరళకు చెందిన నసీర్, ద్వితీయ బహుమతి రూ.15వేల నగదు గుంతకల్‌కు చెందిన పవన్ గెలుచుకున్నారు. సెమీ ఫైనల్, క్వార్టర్ ఫైనల్లో ఓడిన క్రీడాకారులకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యంగ్‌మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు బీఎన్.శంకర్, కమిటీ సభ్యులు విశ్వనాథ్, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, నాగభూషణం, సుధాకర్, హరిప్రసాద్, నారాయణ, శ్యామ్రాజ్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతి అందుకుంటున్న చెన్నై జట్టు

నవంబర్ 23న జిల్లా స్థాయి భగవద్గీత పోటీలు

రాజంపేట టౌన్ : పట్టణంలోని మన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నవంబర్ 23న జిల్లా స్థాయి భగవద్గీత పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ హిందు ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ డాక్టర్ టి.గోపిబాబు, ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. గీతాజయంతిని పురస్కరించుకొని నవంబరు 23న ఉదయం 9 గంటల నుంచి పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి చదివే విద్యార్థినీ, విద్యార్థులకు ఒక విభాగంగా భగవద్గీత 14వ అధ్యాయం గుణత్రయ విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. 10వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు భగవద్గీత 16వ అధ్యాయం దైవాసుర సంపద్విభాగ యోగంపై, 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వరకు గల వారికి నిత్య జీవితంలో భగవద్గీత–భావ విశ్లేషణ అంశంపై పోటీలుంటాయని తెలిపారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ గెలుపొందిన వారికి నగదు ప్రోత్సాహాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు నవంబర్ 20వతేదీలోగా 9110779066 నెంబర్‌కు కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

దళితుల శ్మశాన వాటికకు దారేది?

అతికష్టంపై మృతదేహాన్ని తరలించిన కుటుంబీకులు


పంట పొలాల మీదుగా మృతదేహాన్ని తీసుకెళ్తున్న దళితులు

చాపాడు : దాతలు ముందుకు వచ్చి శ్మశాన వాటికకు స్థలం కేటాయించినా.. కొందరి నిర్వాకంతో ఆప్రాంతానికి వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. మంగళవారం అతికష్టంపై ఓ మహిళ మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించాల్సి రావడంపై దళితులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని పడమర అనంతపురం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున దళితవాడకు చెందిన బుస్సా కనకమ్మ(58) మృతిచెందింది. అదే రోజున మధ్యాహ్నం మూడు గంటల తర్వాత ఆమె మృతదేహాన్ని అంత్యక్రియల కోసం దళితవాడ నుంచి కిలోమీటరు దూరంలో ఉండే శ్మశాన వాటికకు తీసుకెళ్లారు. మార్గమధ్యంలో దారి లేకపోవడంతో వరి పైరు పొలాల్లో అతి కష్టంపై వెళ్లాల్సి వచ్చింది. తమ పొలాల మీదుగా శవాన్ని తీసుకెళ్లేందుకు వీల్లేదని స్థానిక రైతులు కొందరు అడ్డు చెప్పడంతో ఎలా తీసుకెళ్లాలో తెలియక తరచూ ఇబ్బంది పడుతున్నామని దళితులు తెలిపారు. అనేక సార్లు అధికారులకు మొరపెట్టుకున్నా దారి ఏర్పాటుచేయలేదని, అగ్రవర్ణాల వారు తమకు సహకరించడం లేదని దళితులు తెలిపారు. ఇప్పటికైనా స్పందించి దారి ఏర్పాటుచేయాలని వారు వేడుకొంటున్నారు.

16న ఎన్ఎస్ఎస్ ఉత్తమ పురస్కారాల ప్రదానం


జాబితా విడుదల చేస్తున్న వీసీ బెల్లంకొండ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్ : జాతీయ సేవా పథకం ద్వారా విస్తృత సేవలందించిన కళాశాలలు, ప్రోగ్రాం ఆఫీసర్లు, వాలంటీర్లకు ఉత్తమ పురస్కారాల ప్రదానం చేయనున్నట్లు వైవీయూ వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ప్రకటించారు. తన చాంబర్‌లో పురస్కారాలకు ఎంపికైన వారి జాబితాను ఆయన మంగళవారం విడుదల చేశారు. ఈ నెల 16వతేదీన వైవీయూలో అవార్డులు అందజేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ , ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డా.ఎన్.వెంకట్రామిరెడ్డి, డాక్టర్ కె.శ్రీనివాసరావు, ప్రొఫెసర్ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు. 2024–25 సంవత్సరంలో అవార్డులకు ఎంపికైన వారి వివరాలిలా ఉన్నాయి.

ఉత్తమ వాలంటీర్లు : డి శ్రావణి(ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజంపేట), డి.సిద్ధయ్య (ఎస్‌బిఎస్‌వైఎం డిగ్రీ కళాశాల, మైదుకూరు), కేటీ.ఈశ్వర్(వైవియూ కాలేజ్), కె.శ్రీనివాసులురెడ్డి (వైవీయూ పీజీ కళాశాల).

ఉత్తమ ప్రోగ్రామ్ ఆఫీసర్లు : డాక్టర్ కె.గోవింద రెడ్డి(ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఫర్ గర్ల్స్, కడప), డాక్టర్ యు.సునీత(ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, పులివెందుల), సి.మల్లేశ్వరమ్మ, (వైఎస్ఆర్‌వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వేంపల్లి), డాక్టర్ ఎ.నాగరాజు(గవర్నమెంట్ కాలేజ్ ఫర్ మెన్(ఎ), కడప), డాక్టర్ పత్తి వెంకటకృష్ణారెడ్డి(ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైదుకూరు), డాక్టర్ ఎస్.సునీత (వైవీయూ కళాశాల, కడప), డాక్టర్ ఎస్‌పి.వెంకటరమణ(వైవీయూ కళాశాల, కడప).

ఉత్తమ కళాశాలలు : సి.సూర్యారావు(ప్రిన్సిపల్ గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ఫర్ గర్ల్స్, కడప), డాక్టర్ పి.నారాయణ రెడ్డి(ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైదుకూరు), ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ (ప్రిన్సిపల్, వైవీయూ కాలేజ్).

ఒంటరి వృద్ధురాలికి చేయూత

జడ్జి బాబా ఫక్రుద్దీన్ చొరవతో కదిలిన కుమారులు


లక్ష్మమ్మ కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇస్తున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్ : నలుగురు కుమారులు ఉన్నా.. ఒంటరిగా జీవనం సాగిస్తున్న ఓ వృద్ధురాలికి చేయూత అందించేలా కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ చొరవ చూపారు. ఆమె కుమారులకు కౌన్సిలింగ్ ఇచ్చి.. ఆసరా కల్పించాలే చేశారు. కడప తారకరామా నగర్‌లో నివాసముంటున్న బుసల లక్ష్మమ్మకు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు బుసల రమణ కడపలో బేల్దారి పని చేస్తుండగా, ద్వితీయ, తృతీయ కుమారులు బుసల చిన్నప్ప, బుసల చంద్ర ఆటో నడుపుతున్నారు. నాలుగో కుమారుడు బుసల శ్రీనివాసులు కలకడలో టైల్స్ పని చేసుకుంటున్నారు. కుమార్తె బుసల రమణమ్మ కడపలో నివాసం ఉంటోంది. నలుగురు కుమారులు ఉన్నా.. ఆమె ఒంటరిగా జీవిస్తోందనే విషయం జడ్జి బాబాఫక్రుద్దీన్ దృష్టికి రావడంతో ఆయన స్పందించి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులను ఇంటికి పంపారు. అక్కడికి వెళ్లిన న్యాయవాదులు ఆమెకు సాయం చేస్తామని తెలిపారు. అనంతరం జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ లక్ష్మమ్మ కుమారులు, కుమార్తెలను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. వయో వృద్ధుల చట్టంపై వారికి అవగాహన కల్పించారు. పెద్ద కుమారుడు బుసల రమణ రూ.1500, ద్వితీయ, తృతీయ కుమారులు చిన్నప్ప, చంద్రలు ఒక్కొక్కరూ రూ.1500 ఇచ్చేలా ఒప్పందం కుదిర్చారు. ఆమె కుమారుల వద్దే ఉండేలా చూడాలని చెప్పారు. అనంతరం ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించాలని వృద్ధురాలికి సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు మనోహర్, రవితేజ సీనియర్ సిటిజన్ అయిన బుసల లక్ష్మమ్మ కుమారులు, కుమార్తె పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ–సూపర్ ఒత్తిడి!

- ప్రధానమంత్రి సమావేశానికి భారీగా కసరత్తు
- జిల్లా అధికారులపై బాధ్యతలు పెట్టిన జీఎస్టీ కమిషనర్
- నిత్యం పర్యవేక్షిస్తూ మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న వైనం

సాక్షి ప్రతినిధి, కడప : ఎంకి పెళ్లి సుబ్బి చావు కొచ్చిందన్నట్లుగా 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్' కార్యక్రమం అధికారులను ముప్పుతిప్పలు పెడుతోంది. నిద్రలేచింది మొదలు జిల్లా అధికారులకు ఉన్నతాధికారుల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురవుతోంది. ఈ నెల 16న కర్నూల్ జిల్లా నన్నూరు వద్ద నిర్వహిస్తున్న ప్రధానమంత్రి కార్యక్రమానికి ఎంత మందిని తీసుకొస్తున్నారు. వారిలో పారిశ్రామికవేత్తలు ఎంతమంది ఉన్నారు? ఏయే వాహనాల్లో వస్తున్నారు? వాహనాల నంబర్లు ఏమిటి? వ్యాపారులు ఎంతమంది వస్తున్నారు? చిన్న తరహా పరిశ్రమల నిర్వాహకులు ఎవరెవరు వస్తున్నారు? ఇలాంటి ప్రశ్నలతో జిల్లా కేంద్రాలల్లోని అధికారులను రాష్ట్ర ఉన్నతాధికారులు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు.

జీఎస్టీ టారిఫ్‌లు తగ్గిస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విషయమై ఇదివరకే జిల్లా నుంచి మండల స్థాయి వరకూ వివిధ కార్యక్రమాలను చేపట్టారు. సెమినార్స్, ఎగ్జిబిషన్స్, బైక్ ర్యాలీలు చేపట్టాల్సిందిగా ఉన్నతాధికారుల ఆదేశాలను అమలుపర్చారు. వాటి నిర్వహణ ప్రధానంగా లేబర్ డిపార్టుమెంట్, పరిశ్రమల శాఖ, పంచాయితీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. జిల్లా కేంద్రంతోనే సరిపెట్టకుండా నియోజకవర్గం, మండల స్థాయిలో కూడా నిర్దేశించిన కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. ఆ మేరకు స్టేట్ టాక్స్ చీఫ్ కమిషనర్ ఎ.బాబు ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు జీఎస్టీ టారిఫ్ తగ్గించడంతోపాటు తదితర చేపట్టాల్సిన కార్యక్రమాలన్నీ చేశారు. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటున్న బహిరంగసభ విజయవంతం చేయడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఉమ్మడి కర్నూల్ జిల్లాకు పరిమితం కాకుండా రాయలసీమ జిల్లాల్లోని అధికారులకు కూడా టార్గెట్ పెట్టి సమీకరణ చేపట్టాల్సిందిగా ఉన్నతాధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని పలువురు వాపోతున్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు ఎంపిక


ఉచిత శిక్షణకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్, తదితరులు

వేంపల్లె : ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ విద్యార్థులు సివిల్స్ ఉచిత శిక్షణకు ఎంపికైనట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు కోణం ఫౌండేషన్, గేట్ ప్రవేశ పరీక్షలకు హైదరాబాద్ ఏఎస్ ఇంజినీరింగ్ సంస్థ సహకారంతో ఉచిత శిక్షణ ఇస్తున్నారన్నారు. గత నెలలో డా.డి.కోనప్ప ఇందుకోసం ప్రవేశ పరీక్షలు నిర్వహించారన్నారు. ఈ పరీక్షలలో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ నుంచి యూపీఎస్‌సీ శిక్షణకు తొమ్మిది మంది, గేట్ శిక్షణకు 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వీరికి కోణం స్వచ్ఛంద సంస్థ ఉచిత శిక్షణ, ఫెలోషిప్ అందిస్తుందని, గేట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఏఎస్ ఇంజినీరింగ్ సంస్థ ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్ అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి ర్యాంకులు సాధించాలని కోరారు. ఇందుకోసం ట్రిపుల్ ఐటీలో ఒక తరగతి గది ఏర్పాటుచేసి, ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తామని డీన్ ఆఫ్ అకడమిక్ రమేష్ కైలాష్ తెలిపారు.

ప్రైవేట్‌పరం చేసిన మెడికల్ కాలేజీలను
మళ్లీ వెనక్కి తీసుకుంటాం

కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


కోటి సంతకాల పేపర్లను ఆవిష్కరిస్తున్న రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరిస్తోందని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరులోని పుట్టపర్తి సర్కిల్‌లో మంగళవారం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు ఒక్క మెడికల్ కళాశాల అయినా నిర్మించారా? అని ప్రశ్నించారు. జగన్ 17 మెడికల్ కాలేజీలకు అనుమతి తీసుకొచ్చి మంజూరుచేశారన్నారు. వీటిలో ఐదు కళాశాలలను పూర్తి చేశారన్నారు. చేతకాని కూటమి ప్రభుత్వం అన్ని మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలోకి తీసుకొస్తోందన్నారు. ప్రతి మెడికల్ కళాశాలలో సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఉంటుందని, దీనివలన ఆయా ప్రాంతాల్లో పేద ప్రజలకు మంచి వైద్య సేవలు అందుతాయన్నారు. నిర్మాణం పూర్తయిన మెడికల్ కళాశాలలో మెడికల్ సీట్లను కూటమి ప్రభుత్వం తమకు వద్దని కేంద్ర ప్రభుత్వానికి లేఖ పంపిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తప్పనిసరిగా మళ్లీ వెనక్కి తీసుకుంటామన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే కోటి సంతకాల ఉద్యమాన్ని చేపట్టామన్నారు. గవర్నర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళతామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శారద, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ఎంవీ రాజారాంరెడ్డి, ప్రచార కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు దావూద్, మున్సిపల్ కౌన్సిలర్లు, రాజపాళెం మండల అధ్యక్షుడు బాణా కొండారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వృద్ధుడు మృతి


మృతిచెందిన బాలగురయ్య

బద్వేలు అర్బన్ : తన సోదరుడి కుమార్తె సమస్యను పరిష్కరించేందుకు పెద్ద మనిషిగా స్టేషన్‌కు వచ్చిన ఓ వృద్ధుడు స్టేషన్ ఆవరణలోనే గుండెపోటుకు గురై మృతి చెందాడు. మంగళవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. స్థానిక మిద్దెలవారిపాలెంకు చెందిన రాంచానిబాలగురయ్య (60) బేల్దారి పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. తన సోదరుడైన గురవయ్య కుమార్తె దేవి కొంత కాలంగా భర్త వేధింపులకు గురవుతోంది. ఈ నేపథ్యంలో దేవి తన భర్త సాయిపై అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఇరువురి తరఫున పెద్ద మనుషులు స్టేషన్ ఆవరణలో సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సమయంలో దేవి పెద్దనాన్న అయిన బాలగురయ్య ఒక్కసారిగా స్టేషన్ ఆవరణలోనే కుప్పకూలి పోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు హుటాహుటిన బాలగురయ్యను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ లింగప్ప ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు.

చీటింగ్ కేసు నమోదు

కడప అర్బన్: కడప నగరం పూసల వీధికి చెందిన హరేరామ్‌కు ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం చేసిన వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కడప పూసల వీధికి చెందిన హరి రామ్ బీటెక్ పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తుండేవాడు. అనంతపురం జిల్లా నార్పలకు చెందిన ప్రసన్నకుమార్ రెడ్డి ఉద్యోగం ఇప్పిస్తానంటూ మాయమాటలు చెప్పి దాదాపు రూ.1.30 లక్షలు వసూలు చేసి నకిలీ ఉద్యోగ నియామకపత్రం ఇచ్చాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రసన్నకుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ

IV

వైఎస్ఆర్ జిల్లా

బుధవారం ॥ 15-10-2025



“పఠనాభిరుచి కేవలం ఆహ్లాదానికి సంబంధించిన విషయం మాత్రమే కాదని, అభిజ్ఞా వ్యాయామం (కాగ్నిటివ్ ఎక్సర్‌సైజ్) అని శాస్త్రీయ అధ్యయనాలు తెలియ జేస్తున్నాయి. ‘పుస్తక పఠనం అనేది మెదడులో ఇన్ఫర్‌మేషన్ ప్రాసెసింగ్‌కు సంబంధించి కొత్త మార్గాలను సృష్టిస్తుంది’ అంటున్నారు డెవలప్‌మెంటల్ సైకాలజీ అండ్ కాగ్నిటివ్ న్యూరోసైన్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ గ్రెగోయిర్.”



ప్రతీకాత్మక చిత్రం

వద్దిక... ఓవర్ ఒద్దిక బెటర్!

పేరెంటింగ్‌పై చర్చ

ఇది వైరల్ కాలం! సర్వైలెన్స్ కెమెరాల మధ్య బిగ్ బాస్ హౌస్ ఉన్నట్టే జెన్ ఆల్ఫా కూడా తమను సోషల్ మీడియా ఫ్రేమ్‌లో ఫిక్స్ చేసుకుంది! అందుకే వాళ్లు ఎక్కువగా ఇన్‌ఫ్లుయెన్సర్స్‌ను, వాళ్లు చూస్తున్న రీల్స్, షార్ట్స్, షోస్‌లోని క్యారెక్టర్స్‌ను అనుకరిస్తుంటారు. ఈ తీరు కొందరికి అతిగా... అసహజంగా అమర్యాదగా తోచవచ్చు. ఇంకొందరికి ముచ్చటగా అనిపించవచ్చు. ఈ రెండిటికీ ఉదాహరణగా ఇటీవల వైరల్ అయిన కౌన్ బనేగా కరోడ్‌పతి 17 వ సీజన్ ‘కేబీసీ జూనియర్స్’ లో ఓ చిన్నారి పార్టిసిపెంట్ వీడియోను చూపిస్తున్నారు. దీనిపై కామెంట్లు, కాంప్లిమెంట్లను పక్కన పెడితే ఈ వీడియో.. జెన్ ఆల్ఫా పేరెంటింగ్ కి సంబంధించి ఓ చర్చను లేవనెత్తింది...

కేబీసీలో ఇదీ జరిగింది..

కౌన్ బనేగా కరోడ్‌పతి17వ సీజన్‌లోని ‘కేబీసీ జూనియర్స్’ హాట్ సీట్‌లో ఓ బుడతడు కూచున్నాడు. చుట్టూ కెమెరాలు.. ఆడియెన్స్.. ఎదురుగా 83 ఏళ్ల పాపులర్ పర్సనాలిటీ.. ఎవర్‌గ్రీన్ సెలబ్రిటీ అమితాబ్ బచ్చన్.. అయినా ఎలాంటి బెరుకు లేకుండా చాలా రిలాక్స్‌డ్‌గా.. ఇంకా చెప్పాలంటే ఆ కూర్చోవడంలోనే అందరి అటెన్షన్‌ను గ్రాబ్ చేశాడా పిల్లాడు. వాడి ఆత్మవిశ్వాసానికి ముచ్చటపడుతూ అమితాబ్ ‘హాట్ సీట్‌లో కూర్చోవడం ఎలా ఉంది?’ అనడిగారు. ‘ఎక్సయిటెడ్‌గా ఉన్నాను కానీ.. మీరు రూల్స్ చెబుతూ కూర్చోకండి.. నాకు ఈ షో రూల్స్ అన్నీ తెలుసు.. నేరుగా పాయింట్‌కి వచ్చేద్దాం’ అన్నాడు. ఆ జవాబు హోస్ట్ అయిన అమితాబ్‌ను ఖంగుతినేలా చేసింది. అయినా తమాయించుకుని షోని ప్రొసీడ్ చేశాడు. మొదటి ప్రశ్న అడిగి ఆప్షన్స్ ఇచ్చేలోపే జవాబు చెప్పి ఆప్షన్స్ లేకుండానే నా ఆన్సర్‌ని లాక్ చేసేయ్ డాన్స్.. ఆప్షన్ ఏదైనా ఈ ఆన్సర్ లాక్ చేసేయ్’ అన్నాడు అమర్యాదగా. ఆ తర్వాత ప్రశ్న అడిగేముందు ఏదో చెప్పబోతున్న అమితాబ్‌ను ‘మీరు ప్రశ్నయితే అడగండి ముందు’ అన్నాడు అదే ధోరణిని కొనసాగిస్తూ. అదే ప్రవర్తనతో ఆ పిల్లాడు అలా అయిదవ ప్రశ్న దాకా వచ్చాడు. 25 వేలు వచ్చే అయిదవ ప్రశ్న ‘వాల్మీకి రామాయణంలోని మొదటి కాండ ఏది?’ కి ఆప్షన్స్ అడిగాడు ఆ కుర్రాడు.‘బాల కాండ.. అయోధ్య కాండ.. కిష్కింధ కాండ.. యుద్ధ కాండ’ అంటూ నాలుగు ఆప్షన్స్‌ను చదివారు అమితాబ్. వెంటనే ‘బి.. అయోధ్యకాండ’ అని చెబుతూ ‘ఒక్కసారి కాదు ఈ ఆన్సర్‌ను నాలుగుసార్లు లాక్ చేయండి’ అన్నాడు పిల్లాడు. ‘సారీ.. తప్పు చెప్పావ్.. కరెక్ట్ ఆన్సర్ బాలకాండ’ అన్నారు అమితాబ్. ఈసారి ఆ పిల్లాడు ఖంగు తిన్నాడు.

ఆ బాబు వయసు పదేళ్లు. అయిదవ తరగతి చదువుతున్నాడు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఉంటాడు. ఆ పిల్లాడు జవాబులు చెబుతూంటే ఆడియెన్స్ గ్యాలరీలో ఉన్న అతని తల్లిదండ్రులు కొడుకువైపు మురిపెంగా.. గర్వంగా చూడసాగారు.

ఈ కార్యక్రమాన్ని వీక్షించిన వాళ్లు సోషల్ మీడియాలో రెండురకాలుగా స్పందించారు. కొందరు ‘జ్ఞానం ఒక్కటే ఉంటే సరిపోదు.. కాసింత వినయం, సంస్కారం కూడా ఉండాలి’,‘అది కాన్ఫిడెన్స్ కాదు ఓవర్ కాన్ఫిడెన్స్.. ’, ‘చదువు కన్నా ముందు పిల్లలకు మర్యాద, మన్నన నేర్పాలి’, ‘అమ్మో... పిల్లాడు కాదు... మహా ముదురు’ అంటూ, ఇంకొందరు ‘అయిదు నిమిషాల ఫుటేజ్ చూసి పిల్లాడి బిహేవియర్‌ని జడ్జ్ చేయడమేంటీ?’, ‘పేరెంట్స్ పిల్లాడికి కాస్త మర్యాదగా నడుచుకోమని చెప్పి ఉంటే బాగుండేది’ అంటూ కామెంట్ చేశారు.

బ్రేక్ పడాల్సిన ప్లేస్ ఇల్లు...

‘ఇలాంటి ప్రవర్తన ఉన్న ట్రెండ్‌ను 6 -13 ఏళ్ల పిల్లల్లో ఎక్కువగా చూస్తాం. ఇది బుద్ధిమాంద్యం లేదా ఏడీహెచ్‌డీ ఏమాత్రం కాదు. డిఫరెంట్‌గా కనిపించాలనే తాపత్రయం, పదిమంది దృష్టిని ఆకర్షించాలన్న లక్ష్యం. ఒక్క మాటలో చెప్పాలంటే డిఫరెంట్ బిహేవియర్‌తో సోషల్ మీడియా అటెన్షన్‌ను గ్రాబ్ చేయడమన్న మాట. దీనికి ఇండివిడ్యువలిస్ట్‌గా పెరగడం, ఓవర్ కాన్ఫిడెన్స్.. ఓవర్ ఆటిట్యూడ్ బిహేవియర్ కారణం. వాళ్లు సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్, రీల్స్, షార్ట్స్ లోని క్యారెక్టర్లను అనుకరిస్తూ తమ సహజత్వాన్ని మరచిపోతారు. ఆ ప్రభావంతో అందరూ గౌరవిస్తున్న వాళ్ల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తూ అందరి దృష్టిని ఆకర్షించాలనుకుంటారు. అందులో భాగమే పెద్దవాళ్లను ఏకవచనంతో సంబోధించడం, అన్నీ తమకే తెలుసన్నట్లుండటం, వయసుకు మించి మాట్లాడటం లాంటివి. ఇలాంటి పిల్లల ప్రవర్తనను చక్కదిద్దక పోగా దాన్ని వాకి తెలివితేటలుగా అభివర్ణిస్తూ ప్రోత్సహిస్తుంటే ఇదిగో ఇలాగే ఓవర్ కాన్ఫిడెంట్‌గా తయారవుతారు. ఈ తీరును మొక్కగా ఉన్నప్పుడే తుంచేయాలి. దీనికి బ్రేక్ పడాల్సిన ప్లేస్ ఇల్లు.. బ్రేక్ వేసి ఆ ప్రవర్తనను సరిచేయాల్సిన వాళ్లు తల్లిదండ్రులే.



- డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి
కన్సల్టెంట్ చైల్డ్ అండ్ అడల్ట్ సైకియాట్రిస్ట్, హైదరాబాద్

ఆ ట్రైనింగ్ పేరెంట్సే ఇవ్వాలి...

‘ఆ బుడతడి వీడియో చాలా వైరల్ అయింది. వైరల్ అయిన వీడియో కూడా జస్ట్ ఒక టూ త్రీ మినిట్స్ క్లిప్పింగ్ అంతే! దాన్నిబట్టే ఆ పిల్లాడి ప్రవర్తనను, పేరెంటింగ్‌ను జడ్జ్ చేయడం కరెక్ట్ కాదని నా ఉద్దేశం. ట్రోల్ చేయడం కూడా తప్పే. అది పిల్లాడి మీద, అతని తల్లిదండ్రుల మీదా తీవ్ర ప్రభావం చూపిస్తుంది. అయితే.. ఆ పిల్లాడిలో ఇంపల్సివిటీ కనిపిస్తోంది. దాన్ని కంట్రోల్ చేసుకోవాలి. ఆ ట్రైనింగ్ పేరెంట్సే ఇవ్వాలి.

- వర్ష వేముల, సైకోథెరపిస్ట్



● భ్రమణ కాంక్ష



రైలుతో... ఆమె చెట్టపట్టాలు

మోనిషా రాజేష్...
42 ఏళ్ల ఈ ట్రావెల్ రైటర్‌కు
గత 15 సంవత్సరాలుగా రైలే ఇల్లు.
2010లో ఆమె 80 రైళ్లలో దేశమంతా తిరిగి
‘అరౌండ్ ఇండియా ఇన్ 80 ట్రైన్స్’
పుస్తకం రాశారు.
ఆ తర్వాత లోకమంతా
80 రైళ్లలో చుట్టేసి
‘అరౌండ్ ద వరల్డ్ ఇన్ 80 ట్రైన్స్’ రాసి
సంచలనం సృష్టించారు.
ఇప్పుడు స్త్రీలు రాత్రిపూట చేసే
రైలు ప్రయాణాలు ఎలా ఉంటాయో
ప్రపంచమంతా తిరిగి
‘మూన్‌లైట్ ఎక్స్‌ప్రెస్’ వెలువరించారు.
ఈ రైలు ప్రయాణాల
ప్రేమికురాలి పరిచయం...

‘భారతదేశాన్ని చూడాలంటే రైలులోనే చూడాలి’ అంటారు మోనిషా రాజేష్. యు.కె.లో స్థిరపడ్డ ఈ మాజీ జర్నలిస్టు ఇప్పుడు పూర్తిగా ‘ట్రావెల్ రైటర్’గా మారారు. ఆశ్చర్యకరంగా ఆమె తన కెరీర్‌కు ‘రైలు’ను ఒక ఆధారంగా మలుచుకున్నారు. అంటే పుస్తకాలు అమ్మడవగా వచ్చే డబ్బు ఆమెకు రైలు ద్వారా వస్తున్నట్టే. ‘హఠాత్తుగా నాకు ఏమర్థమైందంటే నా పుస్తకాలకు రైలు కంటే మించిన కథానాయకుడు లేడని’ అంటారామె నవ్వుతూ. ఆమె తాజా పుస్తకం ‘మూన్‌లైట్ ఎక్స్‌ప్రెస్ – అరౌండ్ ద వరల్డ్ బై నైట్ ట్రైన్’ మార్కెట్‌లోకి వచ్చింది. ప్రపంచంలోని అనేక దేశాలలో రాత్రి జర్నీల ద్వారా ట్రైన్‌లలో సంచారం చేస్తూ తాను చూసిన ప్రపంచాన్ని పరిచయం చేశారు మోనిషా. ఇప్పటివరకూ ‘రైలు’ ప్రయాణాల ఆధారంగా ఆమెవి నాలుగు పుస్తకాలు వచ్చాయి.

మొదటిసారి రైలుతో ప్రేమ

మోనిషా తల్లిదండ్రులది చెన్నై. ఇద్దరూ డాక్టర్లు. అయితే యు.కె‌లోని నార్‌ఫోక్‌లో స్థిరపడ్డారు. మోనిషా అక్కడే పుట్టి పెరిగింది. ఆమెకు 9 ఏళ్లు ఉన్నప్పుడు తల్లిదండ్రులు రెండేళ్ల పాటు వెనక్కు వచ్చి చెన్నైలో ఉన్నారు కాని ఆ సమయంలో మోనిషాకు దేశం గురించి తెలుసుకునే అవకాశం రాలేదు.

తర్వాత ఆమె చదువు సాగి, జర్నలిస్టుగా మారాక, 2010 లో మరోసారి ఇండియాకు వచ్చారు. ‘నా దేశాన్ని చూడాలి అని నేను అనుకున్నప్పుడు విమాన ప్రయాణం బడాయి వద్దనుకున్నాను. రోడ్డు సేఫ్ కాదు. అందుకే రైలు ప్రయాణం ఎంచుకున్నాను. 90 రోజుల పాస్ తీసుకుని రైళ్లలో తిరగడం మొదలైన రెండు నెలల్లోనే నాకు అర్థమైపోయింది భారతదేశంలో రైలు ప్రయాణం అద్భుతమని. అందుకే ఈసారి ఒక ప్లాన్‌తో వచ్చి 80 ట్రైన్లలో తిరిగి ‘అరౌండ్ ఇండియా ఇన్ 80 ట్రైన్స్’ పుస్తకం రాశాను. దానికి బోల్డంత పాఠకాదరణ, అవార్డులు లభించాయి. ఆ ఉత్సాహం నన్ను రైలులో ప్రపంచ యాత్ర చేసేలా చేసింది’ అని తెలిపారు మోనిషా. ఆమె ఇండియాలో తిరుగుతూ కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు వచ్చారు.. మోనిషా రైలు మార్గం ఉన్న ప్రతి దేశంలో తిరుగుతూ ‘అరౌండ్ ద వరల్డ్ ఇన్ 80 ట్రైన్స్’ పుస్తకం రాశారు. ఇప్పుడు రాత్రి ప్రయాణాలు ఉన్న రైళ్లలో ప్రయాణించి ‘మూన్‌లైట్ ఎక్స్‌ప్రెస్’ పుస్తకం రాశారు.



ధన్యమయ్యే ప్రయాణం

‘నేను భారతదేశమంతా సెకండ్ క్లాస్ ట్రైన్‌లో తిరిగాను. భారతదేశం అర్థం కావాలంటే ట్రైను ప్రయాణం చేయాలి. అదీగాక మనుషులు విమాన ప్రయాణాలతో విసుగెత్తారు. కోవిడ్ వల్ల లాక్‌డౌన్ వచ్చి ముగిశాక ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు భ్రమణకాంక్ష పెరిగింది. లోకం చూద్దాం అనుకుంటున్నారు. దానికి గొప్ప మార్గం రైలే. యూరప్‌లో 2015 నాటికి రాత్రి ప్రయాణాలు ఉండే స్లీపర్ ట్రైన్‌లు బంద్ చేశారు. ఇప్పుడిప్పుడే అవి తిరిగి మొదలయ్యాయి. స్త్రీలు ఒంటరిగా రాత్రిళ్లు రైలు ప్రయాణాలు చేయడం, జీవితాన్ని ఆస్వాదించడంలో భాగమే’ అంటారు మోనిషా.

ప్రకృతి కన్నులు

‘టర్కీ నుంచి ఆర్మేనియా వరకూ 26 గంటల పాటు సాగే రైలు ప్రయాణం అద్భుతం. టర్కీ సౌందర్యం మొత్తం అక్కడ చూడొచ్చు. ఇక అత్యుత్తమ రైలు ప్రయాణమంటే నార్వే దేశానికి వెళ్లాలి. అక్కడ రైలు కంపార్ట్‌మెంట్లు ఇల్లంత సౌకర్యంగా ఉంటాయి. భోజనం ఏది కావాలంటే అది దొరుకుతుంది. అదొక్కటే కాదు రాత్రి మూడు గంటలకు రైలు అద్దాల్లో నుంచి సూర్యోదయం చూడొచ్చు. ఇలా మరెక్కడ సాధ్యం?’ అంటారు మోనిషా.

● కాస్త సరదాగా

ర్యాంప్‌పై స్వీట్ వాక్



- మోడల్స్: శ్రీ గులాబ్ జామ్ గారు, శ్రీ మోతిచూర్ లడ్డుగారు...

స్వీట్లు లేని దీపావళిని ఊహించలేము. మరి దీపావళిని పురస్కరించుకొని ఫ్యాషన్ షోలో మిఠాయిలు పాల్గొంటే ఎలా ఉంటుంది? స్వీట్లు ఏమిటి? ఫ్యాషన్ షో ఏమిటి అని ఆశ్చర్య పోతున్నారా? ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) తలుచుకుంటే ఏదైనా సాధ్యమే కదా! ఒక ఏఐ ఆర్టిస్ట్ దీపావళి స్వీట్స్‌కు మోడల్స్‌గా అందమైన రూపాలను ఇచ్చి ఫ్యాషన్ షోలో పాల్గొనేలా చేశాడు. కాజు కట్లీ వయ్యారపు నడకతో ఫ్యాషన్ షో మొదలవుతుంది. ఆ తరువాత శ్రీయుత మిల్క్ కేక్ గారు, మిస్ బర్ఫీ కుమారి గారు, శ్రీమతి మోతిచూర్ లడ్డుగారు కూడా వస్తారు. చీర ధరించి ర్యాంప్ వాక్ చేసిన సోన్ పాపిడీ గారితో షో ముగుస్తుంది. ఆన్‌లైన్ లో షేర్ చేసిన ఈ ఏఐ జనరేటెడ్ వీడియో నెటిజనులలో నవ్వులు పూయిస్తుంది.

● బై మిస్టేక్

‘క్యాన్’తార



ఒక పౌరాణిక సినిమాలో ఏదో సీన్‌లో దూరంగా రైలు వెళుతున్న దృశ్యం, మరో సినిమాలో కరెంట్ తీగలు కనిపించడం గురించి సరదాగా మాట్లాడుకుంటారు.

తాజా విషయానికి వస్తే... ‘కాంతార’ సినిమాలో ఒక సీన్ వైరల్ అయింది.

కాంతార కథ రాజుల కాలం నాటిది. ఆ కాలంలో వాటర్‌క్యాన్‌లు ఉండే ఛాన్స్ లేదు. అయితే ఈ సినిమాలో విందుభోజనాలకు సంబంధించిన ఒక సీన్‌లో దూరంలో వాటర్ క్యాన్ కనిపిస్తుంది. ఇప్పుడు ఈ మోడ్రన్ ప్లాస్టిక్ క్యాన్ ఇంటర్‌నెట్‌లో టాకింగ్ పాయింట్ అయింది.

‘ఆ కాలంలో ప్లాస్టిక్ లేనే లేదు. నిజానికి ప్లాస్టిక్ ఎప్పుడు పుట్టిందంటే, ప్లాస్టిక్ పితామహుడు ఎవరంటే’ ఇలాంటి జనరల్ నాలెడ్జ్ విషయాలతో పాటు... ‘ఫలానా సినిమాలో ఫలాన పొరపాటును మీరు గమనించారా?’లాంటి విషయాలెన్నో సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు.

ఇక ఈ ప్లాస్టిక్ క్యాన్ సీన్‌పై మీమ్స్ సంగతి సరే సరి. ‘ఇది బడా బ్లండర్ ఏమీ కాదు. పెద్ద సినిమా అన్నాక చిన్న తప్పులు సహజమే’ అని ఒక యూజర్ మూవీ మేకర్స్‌ని సమర్థించాడు.

● లీగల్

మీ మాజీ భార్య భర్తపై మీరు కేసు వేయొచ్చు!

నా భార్య మరొకరితో సంబంధం పెట్టుకొని నా నుంచి విడాకులు తీసుకుంది. విడాకుల కేసులో నేను తనకు ఫలానా వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది అని పేరుతో సహా చెప్పినప్పటికీ, తనకు అలాంటివేమీ లేవని కోర్టును నమ్మించింది. దాంతో నేను పదిలక్షల రూపాయలు భరణంగా చెల్లించవలసి వచ్చింది. మా విడాకులు అయిన 7 నెలలకే తను అదే వ్యక్తిని పెళ్లి చేసుకుంది. తను నా భార్యగా ఉన్నప్పుడు వారు కలిసి తీసుకున్న ఫోటోలు కొన్ని పెళ్లి వీడియోలో పెట్టి ఇంటర్నెట్లో కూడా పెట్టుకున్నారు. నన్ను మానసిక క్షోభకి గురి చేసినందుకు నేను నా మాజీ భార్య ప్రస్తుత భర్తపై కేసు వేయవచ్చా? ఎందుకంటే, ఇటీవలే పేపర్‌లో తైవాన్‌లో భార్య ప్రియుడిపై భర్త కోర్టులో దావా వేయగా కోర్టు అతనికి పరిహారం కూడా చెల్లించమని చెప్పిందని ఒక వార్త చదివాను. మనదేశంలో కూడా అలా చేసే వీలుందా?

- సంపత్, హైదరాబాద్

రెండు వారాల క్రితం ఇలాంటి ఒక కేసు గురించి మన పత్రికలో కూడా సమాధాన రూపంగా చెప్పాను. వివాహేతర సంబంధాలు చట్టరీత్యా నేరాలుగా పరిగణించక పోయినప్పటికీ, సివిల్ దావాలు/పరిహారాలు కోరడానికి భారతీయ చట్టాలలో ఎటువంటి అడ్డంకీ లేదు. మారుతున్న సామాజిక పరిణామాల దృష్ట్యా, వివాహేతర సంబంధాలు ఇకపై సివిల్ కోర్టుకు చేరే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

మీరు మీ మాజీ భార్య ప్రియుడి మీద (ప్రస్తుతం ఆమె భర్త) ఖచ్చితంగా కేసు వేయవచ్చు. పరిహారం కూడా కోరవచ్చు. ఇటీవలే ఢిల్లీ హైకోర్టు తన తీర్పులో ఒక భార్య తన భర్త ప్రియురాలిపై వేసిన దావా చెల్లుతుంది అని పేర్కొంది. అయితే మీరు కేసు వేసిన తర్వాత, మీ మాజీ భార్యకి, తన భర్తకి సంబంధం ఉండేదనే విషయాన్ని ఖచ్చితమైన సాక్ష్యాధారాలతో రుజువు చేయవలసి ఉంటుంది. కోర్టును ఎవరు ఆశ్రయిస్తే వారే తమ పక్షం వాదనని వాస్తవాలేనని రుజువు చేసుకోవాల్సి ఉంటుంది! కేవలం గతంలో వారిద్దరూ కలిసి తీసుకున్న కొన్ని ఫొటోల ఆధారంగా మాత్రమే మీరు కేసు గెలవడం కొంత కష్టమే! అయితే, అసలు మీ మాజీ భార్యకు అతనితో పెళ్లికి ముందు పరిచయమే లేదు అతను ఎవరో నాకు తెలియదు” వంటి సమాధానాలు చెప్పి ఉన్నట్లయితే, మీ డైవర్స్ కేసులో జరిగిన వాదోపవాదాలను ఆధారంగా తీసుకొని మీ తరఫు సాక్ష్యాలుగా కూడా కోర్టు ముందు ఉంచవచ్చు. ఇవన్నీ ఒకవేళ రుజువు అయినట్లయితే మీకు మానసిక క్షోభ కలిగించినందుకు గాను, ఆర్థికంగా కూడా మీరు నష్టపోయినందుకు గాను, మీరు తగిన పరిహారం పొందే అవకాశం లేకపోలేదు. మీరు కేసు వేయాలి, తగిన సాక్ష్యాధారాలతో రుజువు చేయగలను అనుకుంటే, మీ మాజీ భార్యని కూడా కేసులో పార్టీ చేయండి. ఇంతవరకు ఇలాంటి కేసులు లేకపోయినప్పటికీ, ఇటీవలే మన భారతీయ కోర్టులు ఇచ్చిన తీర్పుల ఆధారంగా మీ కేసు విచారణకు మాత్రం అర్హత సాధించింది. కేసు గెలవడం ఓడిపోవడం తర్వాత సంగతి. అన్ని సాక్ష్యాధారాలు, ముఖ్యంగా మీ డైవర్స్ కేసులో మీ మాజీ భార్య ఇచ్చిన వాంగ్మూలాలు/ క్రాస్ ఎగ్జామినేషన్‌లో తను చెప్పిన సమాధానాలు వంటివి నిక్షిప్తపరిచి ఒక లాయర్‌ను సంప్రదిస్తే మీకు ఉపశమనం లభించవచ్చు.

- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది
మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాల కోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.



● వైల్డ్ లైఫ్ ఆర్టిస్ట్

కాంక్రీట్ వనాలు పెరిగిపోతున్న నేటిరోజుల్లో వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందన్నది తెలిసిందే. ఈ క్రమంలో సెల్ఫ్ ఆర్టిస్ట్‌గా పేరొందిన మీరట్ వాసి దీక్షా చౌహాన్ అడవి జంతువుల జీవన వ్యథను, బతుకు పోరాటాన్ని తన హైపర్ రియలిస్టిక్ చిత్రాలతో మన కళ్లకు కడుతోంది. స్థిరమైన ఆదాయాన్ని ఇచ్చే ఇంజినీరింగ్ ఉద్యోగాన్ని వదిలి, చిన్నప్పుడు హాబీగా నేర్చుకున్న పెయింటింగ్‌తో దోస్తీ చేసింది. ఏ టేబుల్ మీద అయితే ల్యాప్‌టాప్‌తో సాఫ్ట్‌వేర్ వర్క్ చేసేదో అదే టేబుల్‌ను కాన్వాస్‌గా మార్చుకుంది. ఐదేళ్లుగా తన బ్రష్ స్ట్రోక్స్‌తో అడవి జంతువులకు గొంతుకగా మారిన దీక్ష పెయింటింగ్ కళ దేశ సరిహద్దులను దాటి ప్రపంచ వన్యప్రాణి ప్రేమికులకు చేరువయింది. ఉపాధితో పాటు ఉపయుక్తమైన మార్గాన్ని ఎంచుకున్న దీక్ష నేడు ఎంతోమంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.



వన్యప్రాణులకు కుంచెతో ప్రాణం



‘ఒక కళాకారిణిగా నేను దేనికీ కట్టుబడి లేనట్టు ఎదుటివారికి అనిపిస్తుంది. కానీ, నేను ప్రతి దానితో కనెక్టివ్‌గా ఉన్నాను. దేనికీ దూరం కాలేదు’ అని చెబుతుంది 29 ఏళ్ల దీక్ష చౌహాన్. ఐదేళ్ల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి, తిరిగి పెయింట్ బ్రష్ పట్టుకుంది. అందమైన సినరీలు, పోర్ట్రయిట్‌లు పెయింట్ చేస్తూ అడవి జంతువులవైపు దృష్టి సారించింది. ఒక ఉన్నతమైన ప్రయోజనాన్ని కలిగించే మార్గాన్ని అన్వేషిస్తూ అడవి జీవుల వ్యథలను చిత్రీకరిస్తూ, వాటికి గొంతుకలా మారింది.

మూలాలకు చేరుకున్న కళ

దీక్ష పెయింట్ బ్రష్ అందుకోవడానికి ముందు సంగీతం, నృత్యం కళలు ఉన్న ఇంట్లో పెరిగింది. కళ ఒక కాలక్షేపానికి కాదు, అది ప్రపంచాన్ని చూపే ఒక మార్గం అని తెలుసుకుంది. ఇంజినీరింగ్ విద్య డిగ్రీకి కొలమానంగా, ఉపాధిని పొందడానికి ఒక మార్గంగా చూపుతున్నప్పటికీ ఒక చోట తనను తాను బంధించుకోలేనని నిర్ణయించుకుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా కెరీర్‌ను కొనసాగిస్తున్న ఆమె కళాకారిణిగా వెనక్కి తిరిగి చూసుకుంది. సంతృప్తిగా సాగుతున్న ఈ కళా ప్రయాణం తనను తన మూలాలకు తిరిగి చేర్చిందనుకుంది.

సృజనాత్మకత పరిరక్షణ

దీక్ష వన్యప్రాణుల చిత్రాలు చాలా వాస్తవికంగా ఉంటాయి. ఆ చిత్రాలను చూసేవారు వెంటనే ఉలిక్కిపడతారు. పులి చూపులు మన మీదకు దూకేలా అనిపిస్తాయి. ఖడ్గమృగాన్ని ఒకసారి తాకి చూద్దాం అనుకుంటారు. పక్షులు ఆకాశం మధ్యలో ఆగిపోయినట్లు కనిపిస్తాయి. అయినప్పటికీ అవన్నీ కదలికలతో సజీవంగా ఉంటాయి. దీక్ష చూపే సున్నితమైన సృజన, సాంకేతిక నైపుణ్యంతో మనల్ని జంతువులతో కనెక్ట్ అయ్యేలా చేస్తుంది. అంతరించిపోతున్న జాతులను రక్షించేందుకు, వాటి ఆవాసాలను సంరక్షించే చొరవకు మద్దతును ఇస్తుంది. దాడికి గురైన మూగప్రాణుల వెతలను కళ్లకు కడుతుంది. ఎన్నో చిత్ర ప్రదర్శనలు, సోషల్ మీడియా, జంతు పరిరక్షకుల సహకారంతో ఆమె తన ప్రతిభను ప్రజలకు చేరవేస్తుంది. మూగజీవాలకు -ప్రజలకు మధ్య వారధిగా తన కళను ఉంచుతుంది. ఆమె కళ జంతుజాలం మనుగడ, దుర్బలత్వం, మనుషుల ప్రమేయం .. ఇలా కథలుగా చూపుతుంది.

ప్రపంచ గుర్తింపు

దీక్ష చేస్తున్న కళా సేవ మన దేశ హద్దులను దాటి ప్రపంచం గమనించేంతగా వెళ్లింది. అన్ని ఖండాలలోని కళారాధకులను చేరుకుంది. కళా సేకరణదారులు, వన్యప్రాణుల రక్షకులు ఆమె సృజనను అర్థం చేసుకున్నారు. జీవ నాణ్యత, మనుగడ, వాటి ఆధారంగా ఉండే లక్ష్యానికి కూడా ఆకర్షితులయ్యారు. ఆమె కాన్వాసులు చాలా మంది చూడని అటవీ ప్రపంచానికి చేరువ చేసింది. స్వరం లేని మూగజీవాలకు తన కళ స్వరం ఇవ్వగలదని దీక్ష నమ్ముతుంది. ఆమె ప్రతి బ్రష్ స్ట్రోక్ ఒక వాదనను వినిపిస్తుంది. ప్రతి పెయింట్ ఒక సందేశాన్ని ఇస్తుంది. ప్రేక్షకులు ఆమె పెయింటింగ్స్ ముందు నిలబడినప్పుడు వారు చిత్రాలను మాత్రమే కాదు దీక్ష కళ్లతో అడవిని వీక్షిస్తున్నారు. అడవి జీవుల కష్టాలను అర్థం చేసుకుంటున్నారు. ఆమె తన స్ట్రోక్స్‌తో మూగజీవాల మనుగడకు పాటు పడేలా చేస్తోంది. ఆమె తన కళ ద్వారా ఉత్కంఠభరితమైన రచనలను కూడా సృష్టిస్తుంది. టాలెంట్‌ను ఇలా కూడా చూపవచ్చు అని ఎంతో మందికి తన కళ ద్వారా రుజువు చేస్తోంది.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) అక్టోబర్ 14న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,31,310	బంగారం (24 క్యారెట్లు)	1,30,340	బంగారం (24 క్యారెట్లు)	1,28,350	బంగారం (24 క్యారెట్లు)	1,30,840	బంగారం (24 క్యారెట్లు)	1,31,000	బంగారం (24 క్యారెట్లు)	1,29,000
బంగారం (22 క్యారెట్లు)	1,18,42	బంగారం (22 క్యారెట్లు)	1,17,950	బంగారం (22 క్యారెట్లు)	1,17,650	బంగారం (22 క్యారెట్లు)	1,21,400	బంగారం (22 క్యారెట్లు)	1,20,520	బంగారం (22 క్యారెట్లు)	1,18,250
వెండి	1,97,000	వెండి	1,85,400	వెండి	2,06,000	వెండి	1,85,400	వెండి	1,85,000	వెండి	2,06,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.